# తుమ్మెద వాలని పువ్వు



ప్రయాగ గృహలక్ష్మి

'ప్రతిమా' జడల్లుకుంటున్న ప్రతిమ మధుకేక వినగానే గదిలోంచి గబగబా బయటికి వచ్చింది. హాల్లోకి వచ్చిన ప్రతిమ ఒక్కసారి ఎవరో పట్టుకుని ఆపేసినట్లుగా అలాగే నిలబడి పోయింది. మధు పక్కన ఎవరో కొత్త వ్యక్తి నిండుగ, హుందాగా అందంగా నిలబడున్నాడు.

'మా చెల్లెలు ప్రతిమ. ఎమ్మే చదువుతోంది' పరిచయం చేశాడు మధు.

'ఇతను హరగోపాల్ నా డియరెస్టు ఫ్రెండు. చేసేపని బిజినెస్.'

'అన్నయ్య హరగోపాల్, హరగోపాల్ అని కలవరిస్తూండే అతనేనా ఇతను?'

'నమస్తే' చేతులు జోడించింది ప్రతిమ.

హరగోపాల్ చూపు బంగారు శలాకలా మెరిసిపోతున్న ప్రతిమ మీద నిలిచి పోయింది కాస్సేపు.

ప్రతిమ గర్వంగా తల విదిలించింది. ప్రతిమకిది కొత్త విషయం కాదు. తన వేపు ఒకసారి చూసినవాళ్ళు తిరిగి తనని చూడలేకుండా ఉండలేరనికూడా తెలుసు. అంగరూ అందమైనదని పొగుడుతూండడంలో, గర్వం, అహంకారం తోడయ్యాయి అందానికి. తనవేపు చూడని వాళ్ళని ఏమీ తెలియని మూర్ఖుల్లో జమకట్టడం అలవాటయింది.

'కానీ ఎప్పటిలా అందరిలాంటి వాడే ఈ హరగోపాల్ అని ఎందుకు అనుకోలేకపోతోంది? ఠీవిగా అసలు అన్నయ్యే పొడవయితే అంతకంటె పొడవుగా లోకాలని జయించిన మహారాజులా ఉన్నాడు' అనిపించింది ప్రతిమకి.

అరగంట యిట్టే గడిచిపోయి నట్టయింది.

'ప్రతిమగారూ' ఏదో చెప్పబోయినా హరగోపాల్ అది మానేసి. గుమ్మంవేపు చూసేసరికి, తనూ అటు వేపు చూసింది ప్రతిమ.

సుమిత్ర మెట్లెక్కి మెల్లగా వస్తోంది. మొహం అంతా వాడిపోయింది. జుట్టు రేగిపోయి చిందరవందరగా ఉంది. అసలే చామనఛాయగల మనిషేమో ఎండలో రావడంవల్ల మొహం కమిలి పోయి మరింత నల్లగా తయారయింది.

'మా రెండోచెల్లెలు సుమిత్ర. బి.ఎస్‌సి. సెకండియర్ చదువుతోంది!'

చెప్పాడు మధు. తల భూమిలోకి దించు కుని నమస్కారం చేసి, తొందరగా నడవ బోయి చీర కాలికి తగులుకొని తూలి, దానిమూలాన చేతిలోని పుస్తకాల్లో ఒకటి పడిపోతే, దాన్ని హరగోపాల్ తీసియిస్తే అందుకుని గబగబా అక్కడినుంచి వెళ్ళిపోయింది సుమిత్ర.

ఒళ్ళు మండిపోయింది ప్రతిమకి. 'కొంచెంకూడా మానర్స్ లేదు దీనికి. యింతోటి అందాన్ని కొరుక్కు తినేస్తారని భయం. ఉత్త అడవిగొడ్డులా ప్రవర్తిస్తుంది' చిరాకుగా అనుకుంది ప్రతిమ.

అయితే ఆ విషయం మధు, హరగోపాల్ ఇద్దరూ పట్టించుకోపోవడంతో తృప్తిగా నిట్టూర్చింది:

కోపంతో గదిలోకి వచ్చింది ప్రతిమ హరగోపాల్ వెళ్ళిపోయిం తర్వాత. మంచం మీద పడుకుని ఉంది సుమిత్ర. అలసట మొహంమీద కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది.

'సుమిత్రా కొంచెంకూడా బుద్ధిలేదు నీకు. నేను అక్కడ కూర్చుని మాట్లాడు తూంటే నువ్విలా వచ్చేస్తే ఏం బాగుంటుంది? అతనేమనుకుంటాడు?' కోపంగా అంది ప్రతిమ.

'నాకు అలా కూర్చుని మాట్లాడా లంటే భయం. నేనలా మాట్లాడలేను. అదీగాక ఎందుకో ఇవాళ చాలా అలసటగా ఉందక్కా.' మెల్లగా అంది సుమిత్ర.

'మరి మగవాళ్ళతో మాట్లాడడానికే



భయపడేదానివి. ఆ క్యాంప్ లో ఎలా మాట్లాడతావు గంటలు గంటలు? అప్పుడు ఈ భయం ఎగిరి పోతుంది కాబోలు?'

'అక్కా క్యాంప్ లో అన్నీ తన స్వంత చెల్లెలిలా చూసుకుంటాడు. నేను గంటల తరబడి ఎప్పుడు మాట్లాడాను? బహుశా ఇంతవరకూ ఒకరగంటయినా అతనితో పూర్తిగా మాట్లాడ లేదనుకుంటాను.' బాధగా అంది సుమిత్ర.

'అసలు ఆ కోతిమొహంతో నువ్వు ఎలా మాట్లాడుతున్నావో నా కర్థం కావడంలేదు బాబా.'

'మాట్లాడడానికికూడా అందచందాలు కావాలాక్కా?'

'మాటలు బాగా వచ్చినా ఏమీ రానట్లు నటిస్తావే. అయినా నీ మొహానికి వాడు చాల్లే.' విసుగ్గా మొహం పెట్టుకుని వెళ్ళిపోయింది ప్రతిమ.


సుమిత్ర పెద్ద కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. 'ఎందుకిలా మాట్లాడు తుందక్క? అక్క చాలా అందమైనదే కావచ్చు. అక్కముందు తను దిష్టి బొమ్మలాగే ఉంటుంది. అలాగని తనని ఇన్ని మాటలనాలా? అసలు క్యాంప్ ఏం అపకారం చేశాడు అక్కకి? దీనికి కారణం అక్క కాదు. తను పెరిగిన వాతావరణం అటువంటిది. అందరూ నువ్వు

అందమైన దానివని పొగిడేవాళ్ళే! అక్కకి ఇలా మాటలనడం రోజూ అల వాటే అయినా తను మాత్రం బాధపడ కుండా ఉండటంమాత్రం అలవాటు చేసుకోలేక పోయింది.' రెప్పల పక్కల నుండి నీళ్ళు జారిపోతూంటే కళ్ళు మూసుకుంది.

రెండునెలలు గిర్రున తిరిగాయి. మొట్టమొదట్లో నాకేం అనుకున్నా, రెండు నెలలు గడిచేసరికి, రోజూ సాయంత్రం హరగోపాల్ కోసం ఎదురు చూడడం అలవాటయి పోయింది ప్రతిమకి.

'ఎందరినో చూసిన తను ఈ హర గోపాల్ కోసం ఎందుకిలా ఎదురెదురు చూస్తోంది? అతను ఒక్కరోజు రాక పోతే ఎందుకింత గిలగిల్లాడి పోతోంది తను? అతని ప్రవర్తనకూడా ఈ మధ్య ఒక పది పదిహేను రోజులనుంచి ఒక మాదిరిగా ఉంటోంది. నాలుగ్రోజుల కిందట మీతో ఒంటరిగా మాట్లాడాలి ఒక్క విషయం అన్నాడు. తను ఊరుకో కుండా ఒక్కవిషయమేనా రెండు విష యాలు కాదూ అంటూ నవ్వింది. అతను ఏదో చెప్పేలోపల సుమిత్ర కాలేజీనుంచి రావడంతో ఆ సంభాషణ అక్కడికి ఆగి పోయింది. నాలుగురోజుల కిందట మీతో ఒక ముఖ్యవిషయం మాట్లాడాలి అన్నాడు. అంత ముఖ్య విషయమా? అయితే ఇప్పుడు చెప్పొద్దులెండి. మరో మంచిరోజు చూసి చెపుదురుగాని లెండి, అని తనడంలో మరేమీ మాట్లాడలేక పోయాడు. తనకి తెలుసు అతను చెప్ప బోయేదేమిటో. కానీ అంత త్వరగా ఒప్పుకో కూడదు. ఎంతమంది అబ్బాయిల గుండెల్లోనో ఆశలదీపాలు వెలిగించిన తను అంత తొందరగా 'అలాగే' అంటే ఏం బాగుంటుంది? కొన్నాళ్ళు అతన్ని ఏడిపించాలి. అసలు అతను అడిగిన వెంటనే 'నాకు మీమీద ఆ అభిప్రాయం లేదు' అంటే అతనిమొహం ఎలా మారు తుంది?' సోఫాలో కూర్చుని ఆలోచనలలో మునిగిపోయిన ప్రతిమ తలుపు చప్పుడు విని అటువేపు చూసింది ఉలిక్కిపడి. ఎదురుగా హరగోపాల్.

'కూర్చోండి' – సోఫా వేపు చూపిస్తూ



అంది ప్రతిమ.

'మీతో ఒక ముఖ్య విషయం చెప్పాలి. బహుశా ఈ మాట చాలాసార్లనుంటాను' కాని, ఊహు నేను చెప్పలేను. ఇదిగో ఈ లెటర్ తీసుకోండి మీకే అర్థమవుతుంది.' బరువుగా ఉన్న కవరు జేబులోంచి తీసిచ్చాడు.

అందుకుంటున్న ప్రతిమ, సుమిత్ర అక్కడికి రావడంతో చటుక్కున చెయ్యి వెనక్కి పెట్టేసింది.

'ప్రతిమగారూ, కొంచెం మంచి నీళ్లిస్తారా?' అడిగాడు హరగోపాల్.

నవ్వొచ్చింది ప్రతిమకి. 'ఎంతతెలివైనవాడు. తను లెటర్ దాచిపెట్టడానికి అవకాశం కల్పిస్తున్నాడు.' తిరిగి ప్రతిమ మంచినీళ్లు తీసుకు వచ్చేసరికి సుమిత్ర అక్కడ లేదు. 'ఈ సుమిత్ర ఎప్పుడూ ఇంతే. మగవాళ్లతో మాట్లాడితేనే పరువు పోతుందనుకుంటుంది.' విసుగ్గా గ్లాసు అందించింది హరగోపాల్‌కి.

'నేను వెళ్తానండీ,' రేపు కాకపోయినా కనీసం వారంరోజుల కయినా సమాధానమిస్తే అదృష్టవంతుణ్ణి.' వెళ్లిపోయాడు హరగోపాల్ ఈమాట అంటూ.

గదిలోకి పరుగెత్తింది ప్రతిమ. టెక్స్ట్ బుక్కులో దాచిన ఉత్తరాన్ని తీసుకుంది. అక్షరాలవెంబడి కళ్లు పరుగెత్తాయి.

'ప్రతిమగారు.'

చాలారోజులనుంచి ఈ విషయం మీకు చెప్పుదామనుకుంటున్నాను. కానీ నేను చెప్పడానికి సిద్ధపడిన రోజున మీరు ఏదో అడ్డు చెప్పడమో, లేకపోతే ఎవరైనా రావడమో జరిగి మొత్తానికి విషయాన్ని ఇంతవరకు చెప్పలేకపోయాను. ఈ రోజు అసలు చెప్పుదామనుకుని మీ యింటికి వస్తున్నాను. ఒకవేళ చెప్పలేకపోతే ఎందుకయినా మంచిదని ఈ ఉత్తరంకూడా రాసుంచాను. అసలు కొన్ని భావాలు మాటల్లోకంటే రాతల్లోనే ఎక్కువ బాగుంటాయోమో అనిపిస్తుంది నాకు. మీరేమీ అనుకోరుకదా! ఎంత ధైర్యంగల మనిషి అనుకుంటారేమో? మీరు మీ మనస్ఫూర్తిగా 'నాకు యిష్టమే' అంటేనే గాని నేను ఏం చెయ్యలేను. మీ పూర్తి

# తుమ్మెద వాలని పువ్వు

సహాయం, అంగీకారం రెండూ కావాలి నాకు. మీ యిష్టంతోనే జరుగుతుంది ఇది. మీ యింటికొచ్చిన మొదటిరోజున కాకపోయినా, కొన్నాళ్లయింతర్వాత నా జీవన సహచరి చేరువలో ఉందని గ్రహించాను. అలాంటప్పుడు అందుకోడానికి ప్రయత్నం చెయ్యడం అపరాధమంటారా? చదువు మధ్యలో ఆగిపోతుందేమోనని బాధపడతారేమో అందరూ. నాకు చదువుతో నిమిత్తం లేదు ప్రతిమగారు. నాక్కావల్సింది నన్ను అభిమానంతో, ప్రేమతో, గౌరవంతో చూసే అమ్మాయి కావాలి నాకు. నా సంగతి మీకు తెలియదు. నాకసలు ముక్కుమీద కోపం. ఎదుటివాళ్లు మాటకి మాటా సమాధానమిస్తే అసలు కోపంతో పిచ్చివాణ్ణయి పోతాను. ఆ పరిస్థితుల్లో సమాధానం యివ్వకపోవడమే మంచిది ఎవరికైనా. ఎంత న్యాయం అంటారా? నేను కోపంగల మనిషినేకాని నాకు ఎదురు చెప్పకపోతే, నేను ఎదుటివాళ్లను క్షమార్పణ కోరే రీతిని ఎవరూ కోరరేమో. వీటన్నిటికీ సమాధానం ఆ పెద్ద కళ్లలో చదువుకుని ఈ నిర్ణయానికి వచ్చాను. ఇన్ని మాటలు అంటున్నవ్యక్తి అసలువ్యక్తి అంగీకారం తీసుకున్నారా అంటారేమో! తీసుకున్నాను. మాటలతో చెప్పకపోయినా కళ్లతో చెప్పింది.

ప్రతిమ బుగ్గలు ఎరుపెక్కాయి. ఎంత చమత్కారంగా రాశాడు ఉత్తరాన్ని. 'తనకళ్లలోని భావాలు అన్నీ ఎంత బాగా గ్రహించాడు.' మళ్లీ కళ్లు ఉత్తరం వేపు మళ్లాయి.

కాని ఒక్క షరతు పెట్టింది. అదేమిటో తెలుసా? మా అక్కకి పెళ్లి కాందే నేనెలా చేసుకుంటాను? మావాళ్లు ఒప్పుకోరు అంది. నిజమే యింట్లో పెద్దపిల్ల మీరుండగా సుమిత్రని నాకిచ్చి ఎలా పెళ్లిచేస్తారు? నేను సుమిత్రతో ఏమన్నానో తెలుసా? మీ అక్కకేం బంగారు బొమ్మలాగుంటారు. ఎవరైనా కళ్లకద్దుకుని చేసుకుంటారు అన్నాను. మీరేమంటారు? చేసిన సాహసానికి మన్నించండి. సుమిత్ర నాకు కావాలి. మీరు సహాయం చేస్తేనే మా పెళ్లి జరిగేది.' ఆపైన చదవలేక పోయింది. చేతుల్లోంచి కాగితాలు కిందకి జారిపోయాయి.

ఏమిటి దసలు? ఇది కలా నిజమా? ఇంతకంటె నువ్వందమైన దానివి కాదని ఎవరైనా అన్నా కూడా ఇంత ఆశ్చర్యం కలగదేమో తనకు. నమ్మలేకుండా ఉంది. పెద్దకళ్లు, పొడవాటి జడ తప్పిస్తే మరే విధమైన ఆకర్షణా లేని సుమిత్రనా పెళ్లిచేసుకోవడానికి పర్మిషను అడిగాడు అతను? అయితే ముందర రాసిందేదీ తన గురించి కాదన్నమాట. సుమిత్ర ఎంత నాటకమాడింది! నిజంగా హరగోపాల్ సుమిత్రని ప్రేమించాడా? లేక సుమిత్ర తనమీదేమైనా చెప్పిందా? స్వంతక్కమీద అలా చెప్పగలదా? ఏమో స్వార్థం ఈర్ష్య మనుష్యుల్ని ఒడుపులో పెట్టుకుంటే, ఇంక స్వపరభేదం ఎందుకు కన్పిస్తుంది! చిన్నప్పటినుంచి అందరూ తన్ని ముద్దుగా చూసేవాళ్లే. సుమిత్ర ఇప్పటికి ఎన్నిసార్లు ఈ విషయమై ఏడ్చిందో అందరికంటే తనకి బాగా తెలుసు. ఈర్ష్యతో ఏమన్నా అని హరగోపాల్ మనసు విరిచేయలేదు కదా? లేకపోతే తనతో అంత సరదాగా ఉన్న తను హటాత్తుగా సుమిత్రని పెళ్లి చేసుకుంటానని రాయడమేమిటి? అమ్మ ఒప్పుకుంటుందా అసలు దీనికి? పైగా తనసుమతి కావాలిట? అసలు తను పెళ్లే చేసుకోనంటే, ఏం చేస్తారు? అసలు ఈ పెళ్లి ఎలా జరుగుతుంది?' ఈర్ష్య, అసూయలు దేహాన్ని దహించేస్తుంటే సుమిత్రున్న గదివేపు అడుగులు వేసింది.

లోపలికి అడుగు వెయ్యబోయి అలాగే నిలబడిపోయింది ప్రతిమ. సుమిత్ర సోఫాకి ఆనుకుని కళ్లు మూసుకుని ఉంది. 'బహుశా నిద్రపోతుందేమో?' చెంపల మీద పడుతున్న జుట్టుతో, ఒక పక్క గులాబి పువ్వుతో, నీలంరంగు చీరలో, అందంగా కనిపించింది సుమిత్ర మొదటిసారిగా ప్రతిమ కళ్లకి. సుమిత్ర కెదురుగా ఉన్న టేబుల్‌మీద ఏదో పుస్తకం, అందులోంచి తొంగి చూస్తున్న

కాగితాలు గాలికి మెల్లగా రెపరెప లాడుతున్నాయి. మెమ్మదిగా అడుగులు వేసి సోఫా వెనక నిలబడి దానివేపు చూసింది. ముత్యాల్లాంటి అక్షరాలు. కళ్ళు తిప్పుకోలేకపోయింది ప్రతిమ. అలాగే నిలబడి దాన్ని చదవడం మొదలుపెట్టింది.

'త్వరలో నా దానివి కాబోతున్న సుమీ',

ఈ లెటర్ బహుశా మధ్యాహ్నం ఏ ఫిజిక్సు క్లాసులోనో, మాత్స్ క్లాసులోనో పరధ్యానంగా నువ్వు వింటున్నప్పుడు నిన్ను చేరుతుందనుకుంటాను. ప్రొఫెసర్ ఏమన్నా అంటారేమోనని భయపడి లెటర్ అప్పుడు చదవకుండా పుస్తకంలో పెట్టేస్తావేమో! అలా చేస్తే ఊరుకోను. వెంటనే చదవాలి! లేకపోతే శుభ్రంగా పెర్మిషను అడిగి బయటికి వచ్చేసి మీ అమ్మాయిలకో వెయిటింగు రూముంటుందిగా అక్కడ కూర్చుని చదువుకో. సుమీ ఇది నా మొదటి ఉత్తరం కాబోలు. ఇది మరుపురానిది, మరువలేనిదిగా ఉండాలనుకుంటాను. ప్రయత్నిస్తాను. సుమీ మనలాంటివాళ్ళు ఉత్తరాలు రాసుకుంటే నీలం లేక పింక్ పేపర్లమీదే రాయాలని, అని చాలామంది అనడం నే విన్నాను. ఎందుకో నాకు పాలనురుగులాంటి తెల్లటి పేపరుమీద రాయడమే ఇష్టం. ఎందుకంటే తెలుపు స్వచ్ఛతకి చిహ్నంకాదా. అలాగే నా హృదయంకూడా స్వచ్ఛంగా ఉంది. అందులోకి నువ్వు అడుగుపెట్టు దేవీ అని అర్థం అన్నమాట తెల్ల కాగితంమీద రాస్తే. మరి సుమిత్రాదేవిగారు ఎప్పుడు గృహ ప్రవేశం చేస్తారో. నిజం చెప్పాలంటే సుమీ నాకు అందరూ రాసే, సినిమాల్లో చూపించే ప్రథమ వీక్షణంలో ఉదయించే ప్రేమమీద నమ్మకం లేదు. అసలు అది జరగదనికూడా అనిపిస్తోంది. అయితే ఒకటిమాత్రం నిజం. ఎందుకో కొంతమంది మీద మొట్టమొదటి చూపులోనే ఒకరకమైన అభిమానం ఏర్పడుతుంది. అలాంటప్పుడు వాళ్ళిద్దరూ చేరువలో ఉండే పరిస్థితులేర్పడితే ఒకళ్ళ నొకళ్ళు అర్థం చేసుకునే అవకాశాలు ఏర్పడగానే వాళ్ళిద్దరి మధ్య అప్పుడు ప్రేమ కలగవచ్చునేమో? అసలు అదే ప్రేమనిపించుకుంటుంది. మొట్టమొదటి రోజున అనేటిగా మెట్లెక్కి వస్తున్న నిన్ను నాదగ్గరగా కూర్చోపెట్టుకుని కాస్తసేద తీర్చే మాటలేమైనా నాలుగు చెప్పాలనిపించింది. నాకు దూరంగా వెళ్ళిపోతున్న నిన్ను, నీ పెద్దజడని అదే పనిగా చూశానంటే నువ్వు నమ్మతావా? పెద్దజడున్న వాళ్ళంటె నాకు చాలా ఇష్టం. వదులుగా జడవేసుకుని, ఒకపక్కగా గులాబీ పెట్టుకుంటే అమ్మాయిలు ఎంతందంగా ఉంటారని? నువ్వుకూడా అలా ఉండకూడదూ నాకోసం. నువ్వు రోజూ కాలేజీకి దగ్గర దారిన నడిచి వెళ్తావనుకుంటాను. కాస్త దూరమయినా మాయింటిమీంచి వెళ్ళకూడదూ. ఇటునుంచి వెళ్ళినా కాలేజీ వస్తుందిగా! బహుశా తొమ్మిదిన్నరకి బయలుదేరుతావనుకుంటాను. నాకు సుప్రభాతం అయేదికూడా అప్పుడే నిద్రలేవగానే కిటికీలోంచి దేవిగారి దివ్య మంగళ విగ్రహం చూడడానికి అవకాశమిస్తే ధన్యుడనవుతాను. నువ్వు ఒప్పుకుంటే రోజూ కారులో నేను లిఫ్టు ఇవ్వగలను. కానీ నేను నిద్రలేచి నిన్ను కాలేజీకి తీసికెళ్ళేసరికి మీ కాలేజీ విడిచిపెట్టే టైము అయిపోతుందేమో! యింకో విషయం నాకు నీలంరంగు అంటె ప్రాణం. అందుకే ఈ రోజునుంచి నువ్వు ఏ చీర కొనుక్కున్నా నీలంరంగులోనే తీసుకో. ఏమిటీ ఈ అధికారం అంటావా? ఆప్యాయతతో కూడిన అధికారంలో ఎంత ఆనందం ఉంటుంది. పోనీ నీకేరంగు ఇష్టమో చెప్పు. నేను ఆ రంగులోనే బట్టలు తీసుకుంటాను. ఈ రోజు సాయంత్రం నేను మీ అక్కతో చెప్పిస్తాను. లేకపోతే ఉత్తరం రాసి యివ్వడమన్నా చేస్తాను. మీ యింటి కొచ్చినప్పుడు లోపల గదుల్లో ఎక్కడో దూరి కూర్చోక కొంచం బయటికి రా. అవకాశం లేకపోయినా నేను అవకాశం కల్పిస్తాను. నిన్ను తలుచుకుంటూ రాత్రికి నిద్ర పోవచ్చు.'


'అయితే ఇందాకల మంచినీళ్ళు తీసుకు రమ్మని తనని లోపలికి పంపించింది సుమిత్రని తనివితీరా చూడ్డానికేమో? అయితే హరగోపాల్ సుమిత్రని నిజంగా ప్రేమిస్తున్నాడా. ఎక్కువగా మాట్లాడడమే రాని సుమిత్రని అతను ఎప్పుడు? ఎక్కడ? ఎలాగ? కలుసుకుని అడగ గలిగాడు?' ప్రతిమ కళ్ళు తిరిగి ఉత్తరంవేపు తిరిగాయి, ఇతరుల ఉత్తరాలు చదవటం సభ్యతకాదని తెలిసినా.

ఒక్కసారి విసురుగాలి వచ్చి కాగితాల్ని ఎదిపెయ్యడంతో ఇంక చదవలేకపోయింది ప్రతిమ

కాగితాలు రెపరెప లాడిన శబ్దానికి కళ్ళు విప్పింది సుమిత్ర

'అక్కా' లేచి నిలబడింది ఆశ్చర్యంగా చూస్తూ.

'సుమిత్ర కళ్ళు పెద్దవిగా ఎంతం



# తుమ్మెద వాలని పువ్వు

[illegible] [illegible]. [illegible] [illegible] [illegible] చూసింది ప్రతిమ.

'సుమిత్రా హరగోపాల్ లెటర్ రాశాడు. అసలు అతను నిన్ను ఎప్పుడు ఎలా అడిగాడు?' కసిలో చెంపలు ఎర్రబడుతూ మొహం మండిపోతూంటే కటువుగా అడిగింది ప్రతిమ కుతూహలాన్ని దాచిపెడుతూ.

ప్రతిమవేపు కాకుండా మరోవేపు మొహం తిప్పుకుని, కిటికీకి దగ్గరగా నిలబడి చెప్పింది సుమిత్ర. 'ఒకరోజు నేను క్లాసు అయి బయటికి వస్తుంటే హరగోపాల్ కారుదగ్గరున్నారు. నేను వద్దంటున్నా వినకుండా నన్ను బీచ్‌కి తీసుకు వెళ్లారు. అతనే అడిగాడు మొట్టమొదట. ఏం చెప్పాలో తెలియలేదు నాకు. కానీ చివరికి అలాగే అనే వరకు వదిలిపెట్టలేదు. అయితే దీనికిముందు నాలుగయిదు సార్లు మా కాలేజీకివచ్చి నాతో మామూలుగా మాట్లాడి వెళ్లారు. నేను నీ పెళ్లి జరిగితే కానీ పెళ్లాడను అన్నాను. అదంతా నేను చూసుకుంటానన్నారు.' సుమిత్ర చెక్కిళ్లు ఎరుపురంగును పులుముకోవడం గమనించింది ప్రతిమ.

ఆవేశంతో కుతకుత లాడింది మనసు. 'సుమిత్రా నా పెళ్లి ఇప్పుడప్పుడే జరగకపోతే, అసలు ఎప్పటికీ జరగకపోతే, ఏం చేస్తారు?' వ్యంగ్యంగా అంది ప్రతిమ.

ఒక్క క్షణం ఆలస్యాన జవాబు వచ్చింది సుమిత్ర దగ్గర నుంచి.

'నాకోసం యుగ యుగాలైనా వేచి ఉంటారు హరగోపాల్' సుమిత్ర గొంతులో ధ్వనించిన ఆత్మవిశ్వాసం ప్రతిమ గుండెల్ని పదునైన కత్తితో చీల్చింది.

'నువ్వు నమ్ముతున్నావా ఈ మాటలన్నీ? మగవాళ్లందరూ ఇలాగే అంటారు. నేను పదేళ్లవరకు పెళ్లి చేసుకోపోతే అంతవరకూ అతను నీకోసం తపస్సు చేస్తాడా? అతనూ మగవాడేగా?' సుమిత్రలో పిరికి మందు పోస్తూ అంది ప్రతిమ.

'అక్కా నన్నేమైనా అను. కానీ ఆయన్నేమీ అనకు.'

'ఓ...ఇదంతా హరగోపాల్‌ని చూసుకుని కాబోలు.'

'కాదు. కానే కాదు. కన్నకూతురునయినా అమ్మా నాన్న, స్వంత చెల్లెలినయినా నువ్వూ ప్రతిసారి, నన్ను అవమానిస్తూనే మాట్లాడారు కానీ ఒక్కసారి కూడా ఆప్యాయంగా మాట్లాడలేదు. మొట్టమొదటిసారిగా నేను మనిషిననీ, అందులోనూ ఆడపిల్లనని, ఒక అందమైన అబ్బాయిని ఆకర్షించగల శక్తి నాకుందనీ, నేను హరగోపాల్‌వల్లే తెలుసుకున్నాను.' మెల్లగా అంది సుమిత్ర.

ఈడ్చిపెట్టి చెంపమీద కొట్టినట్లనిపించింది ప్రతిమకి. [illegible] [illegible] సుమిత్ర కూడా అతన్ని అభిమానిస్తోందన్నమాట. కనీసం తను ఈర్ష్యపడుతున్నట్లయినా వాళ్లకు తెలియకూడదు. అందంతో అన్ని విషయాల్లోనూ అర్హత సంపాదించుకున్న తను యివ్వాళ ఈ ఓటమిని భరించలేదు. అసలు విషయం చెప్పి హీనపడలేదు తను' అనుకుంది ప్రతిమ.

'అయితే యిన్నాళ్లూ మేం బాధపెట్టామన్నమాట నిన్ను. ఇంకే ఉద్ధారకుడు దొరికాడుగా. మీరు ఎలా పోతేం నాకేం. ఇప్పుడే వెళ్లి అన్నయ్యతో చెప్తాను.' కోపంగా అంది ప్రతిమ.

'అక్కా నువ్వు—నీ పెళ్లికాకుండా ఎవరైనా, ఏమన్నా అంటే' మాటలు మధ్యలో ఆపేసింది సుమిత్ర.

'ఎవరు ఏమని, ఎందు కనుకుంటారు? నాకేదైనా లోపం ఉంటే అనుకుంటారు? కాని నాకేం తక్కువ? అందమా? చదువా? నాకోసం నువ్వు సానుభూతి చూపక్కరలేదు. అయినా నీ మొహానికి హరగోపాల్ చాల్లే.' మనసులో ఎవరో నువ్వు ప్రేమించిన మొట్టమొదటి అబ్బాయే నిన్ను తిరస్కరించాడు, అంటూంటే దాన్ని అణిచిపెడుతూ, అహంకారం, గర్వం వదలని ప్రతిమ అంది.

'మంచిమాట చెప్పడానికికూడా యింత కటువుగా మాట్లాడాలా?'

సుమిత్ర పెద్దకళ్లలో ఇప్పుడు నీళ్లు నిల్వలేదు. వాటి స్థానంలో ఆనందం, ఆత్మవిశ్వాసం చోటు చేసుకున్నాయి.

ఒకడుగువేసి సుమిత్ర దగ్గరనుండి కాస్త యివతలకి వచ్చింది ప్రతిమ. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసింది. కిటికీ దగ్గరగా సుమిత్ర. రేపు సుమిత్ర చెయ్యి పట్టుకునేందుకు హరగోపాల్ వస్తాడు కాబోలు. గుండెల్లో ఎవరో వెయ్యి గొంతుకలతో అరుస్తున్నట్లనిపించింది ప్రతిమకి, 'సంపెంగపువ్వుకి సువాసన, అందం అన్నీ ఉన్నా తుమ్మెద వాలదంటారు దానిమీద. నువ్వూ అలాంటిదానివే ప్రతిమా అని.' ●

